నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 నిజామాబాద్, గురువారం 23 మే 2024 NIZAMABAD

## కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలి

**-కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

ఆర్మూర్‌టౌన్, మే 22: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులను పలుకరించి కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రకియను సమర్థవంతంగా నిర్వహిస్తూ తుది దశకు చేర్చారని అన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీఎం జగదీశ్, డీసీవో శ్రీనివాస్ ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## వలకు చిక్కిన భారీ చేపలు..


ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప

చెరువుల్లో 5 నుంచి 15 కిలోల వరకు బరువున్న చేపలు దొరకడమే చాలా అరుదు. అది ఆషామాషీ చేపకాదు. ఎన్నాళ్లు పెరిగిందో తెలియదు కానీ ఏకంగా 25 కేజీల బరువు ఉన్న చేప దొరికింది. భారీ చేప వలకు చిక్కడంతో మత్స్యకారుల కాసుల పంట పండింది. ఇది నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని చెరువులో బుధవారం మత్స్యకారులు చేపలు పడుతుండగా కొన్ని భారీ చేపలు వలకు చిక్కాయి. చేపలు సుమారు 25 నుంచి 30కిలోల వరకు తూగడం విశేషం.

–ఎడపల్లి, మే 22

నాడు



నేడు



పచ్చని పంట పొలం అనుకుంటే మీరు భ్రమపడినట్లే.. ఇది పొతంగల్ మండల కేంద్రంలోని పాత పొతంగల్ గ్రామ సమీపంలో ఉన్న ఊర చెరువు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో మిషన్ కాకతీయ పథకం కింద పునరుద్ధరణలో భాగంగా చెరువు పూడిక తీసి శుభ్రంగా నీటిని నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చాక చెరువుల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువులో గుర్రపు డెక్కతో నిండిన పట్టించుకునే వారు లేరని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. – కోటగిరి, మే 22

# ఉపాధి జోరు

**గ్రామాల్లో ముమ్మరంగా పనులు**

- రెట్టింపైన కూలీలు
- చెరువులు, పంటకాలువల్లో పూడికతీత పనులు

సారంగాపూర్, మే 22: పేదలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వరంలా మారింది. సొంత ఊరిలో పనుల కల్పనతో ఆర్థికంగా ఊరట చెందుతున్నారు. యాసంగి వ్యవసాయ సీజన్‌లో ఈ పనులు మందకొడిగా సాగినా ఇప్పుడు ఊపందుకున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలవుతున్నది. చెరువులు, కుంటల్లో పూడికతీత, పొలాలకు మట్టిదారులు, పంట కాల్వల మరమ్మతులు, నర్సరీల్లో మొక్కల సంరక్షణ తదితర పనులు చేపడుతున్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఉదయం 7గంటలకు పనులను ప్రారంభించి మధ్యాహ్నం 12గంటల లోపు ముగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**గ్రామాల వారీగా లక్ష్యాలు..**

ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నిత్యం పెద్ద సంఖ్యలో కూలీలు పనులకు హాజరయ్యేలా జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఊరూరా గ్రామసభలు, సమీక్షలు, కోరిన వారికి జాప్యం లేకుండా జాబ్ కార్డు అందజేత తదితర కారణాలతో కూలీలు పనులకు వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వేసవి నేపథ్యంలో ఉపాధి పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, షేడ్ నెట్లు పలుచోట్ల అందుబాటులో ఉంచున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.


శ్రీనగర్‌లో ఉపాధి పనుల్లో భాగంగా శుభ్రమైన పంటకాలువ

**జిల్లాలో రెండోస్థానం..**


నిజామాబాద్ రూరల్ మండలంలోని 19 గ్రామాల్లో 8042 జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఉన్నారు. ఇందులో 7669 మంది కూలీలు యాక్టివ్‌గా ఉండ గా ప్రస్తుతం 2594 మంది పనులు చేస్తున్నారు. శ్రీనగర్, జలాల్‌పూర్ గ్రామాల్లో పంట కాలువల్లో పేరుకుపోయిన మట్టిని, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. మిగతా 17 గ్రామాల్లో చెరువుల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. మల్కాపూర్ తండా శివారులోని మొగులాలి చెరువులో అత్యధికంగా 345 మంది కూలీలు పనిచేస్తున్నారు. మల్లారంలో 310 మంది, తిర్మన్‌పల్లిలో 290 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. కూలీలు చేపడుతున్న పనులకు కొలతలు చేసి బట్వాడా బిల్లుల కోసం రికార్డులో నమోదు చేస్తున్నారు. ఈ మండలంలో ఒక్కో కూలీకి రోజుకు సుమారుగా రూ.206.25 వస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా కూలీ పొందుతున్న మండలాల్లో నిజామాబాద్‌రూరల్‌ది రెండో స్థానం.



**రూ.1.18 కోట్లు చెల్లించాం**

మండలంలో ఫిబ్రవరి నుంచి ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. మే 2వ వారం వరకు ఉపాధి పనులు చేసిన 3,667 మంది కూలీలకు రూ.కోటీ18 లక్షల 66 వేలు బిల్లులు చెల్లించాం. పనిచేసిన కూలీకి రోజుకు సుమారుగా ప్రస్తుతం రూ.206.25 కూలీ రేటు చెల్లిస్తున్నాం.

**- మధురిమ, ఎంపీడీవో, నిజామాబాద్**


మల్కాపూర్ తండాలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు


వర్షం కురవడంతో నిజాంసాగర్‌లోని ఓ కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు

## ఈదురుగాలులు.. మోస్తరు వర్షం

- ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో వాన
- నేలకొరిగిన చెట్లు.. భయాందోళనలో రైతులు

ఖలీల్‌వాడి/ సిరికొండ/ నిజాంసాగర్/బాన్సువాడ, మే 22 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులతో ప్రారంభమైన వాన పలుచోట్ల భారీగా కురిసింది. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాళ్లరామడుగులోని అంబేద్కర్ విగ్రహం వెనకాల ఉన్న భారీ వృక్షం ఈదురుగాలులకు నేలకొరిగింది. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నిజాంసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురవగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యపు రాశుల చుట్టూ వర్షపు నీరు చేరింది. రైతులు ముందస్తుగానే టార్పాలిన్లను కప్పడంతో ధాన్యం తడవలేదు. గత వారం రోజులుగా మండుతున్న ఎండలు, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న నిజామాబాద్ నగర ప్రజలు వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. బాన్సువాడ పట్టణం తోపాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులు, వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



నిజామాబాద్‌లో కురుస్తున్న వర్షం

## ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి,మే 22 : ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, మిగిలిన ధాన్యాన్ని శనివారం లోపు అన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ రైస్‌మిల్లర్లను కోరారు.కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రైస్ మిల్లర్లతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో 90శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని, ఇంకా 30,137 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే మిగిలి ఉన్నదని తెలిపారు. మిల్లుల సామర్థ్యం, దించుకున్న ధాన్యం వివరాలను రాష్ట్రస్థాయి విజిలెన్స్ బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయని, వారికి అవకాశం ఇవ్వకుండా త్వరితగతిన ధాన్యం దించుకోవాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. బాన్సువాడ డివిజన్‌లోని కోమలంచ,అచ్చంపేట తదితర ప్రాంతాల్లో 5,700 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నదని, డివిజన్‌లోని 11 రైస్‌మిల్లర్లు 500 మెట్రిక్ టన్నుల చొప్పున శనివారం వరకు ధాన్యం దించుకోవాలన్నారు.సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

# ఇసుకను తోడేస్తున్నారు

- ఉదయం ఎడ్ల బండ్లపై.. రాత్రి ట్రాక్టర్లతో
- ప్రతిరోజూ వందల ట్రిప్పుల రవాణా
- అధికారుల నిఘా కరువు
- పట్టని రెవెన్యూ, పోలీస్ శాఖ
- ప్రభుత్వ ఆదాయానికి గండి

**ఇసుకాసురులు** రెచ్చిపోతున్నారు. వాగులు, వంకల నుంచి యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. గుట్టల కొద్దీ డంపు చేసి పెడుతున్నారు. మధ్య తరగతి వారి నిర్మాణ అవసరాలను ఆసరాగా చేసుకొని అడ్డగోలు ధరలతో దోచుకుంటున్నారు. అక్రమంగా లక్షలు గడిస్తున్నారు. రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శించడం కూడా ఇసుక అక్రమ రవాణాదారులకు కలిసి వస్తున్నది. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు.

–భీమ్‌గల్, మే 22

భీమ్‌గల్ మండలంలో ఇసుక అక్రమ రవాణ మూడుపూలు ఆరుకాయలుగా కొనసాగుతున్నది. కప్పల వాగు నుంచి రాత్రీ పగలు అనే తేడా లేకుండా విచ్చల విడిగా తోడుకుపోతున్నారు. ఉదయం ఎడ్ల బండ్లు, రాత్రిపూట ట్రాక్టర్లపై వందల ట్రిప్పుల ఇసుకను తరలించి గ్రామ శివారుల్లో గుట్టలుగా డంపు చేసి విక్రయిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు.

**ఎన్నికల బిజీలో అధికార యంత్రాంగం..**

మొన్నటి వరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు లోక్‌సభ ఎన్నికల హడావుడిలో ఉండడంతో నిఘా కరువైంది. అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. భీమ్‌గల్ పట్టణంతోపాటు బెజ్జోరా, జాగిర్యాల్ గ్రామాల్లోనూ ఇసుక అక్రమ రవాణ జోరుగా కొనసాగుతున్నది. ప్రతిరోజూ 70–80 ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. కొందరు ఇసుక రవాణాకు ఎడ్ల బండ్లను కూడా వినియోగిస్తున్నారు. ప్రభుత్వ అనుమతితోనే ఇసుక రవాణా చేస్తున్నామని చెబుతున్నా.. అధికారులు మాత్రం తామంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నామని, ఇటీవలి కాలంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదని వెల్లడించడం గమనార్హం.

**రెట్టింపు ధరలకు విక్రయం..**

ఇసుక దందాతో అక్రమార్కులు లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. గతంలో ఇసుక రవాణాకు వారంలో రెండురోజులు (బుధ,శుక్ర) మాత్రమే అధికారులు అనుమతి ఇచ్చేవారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక కోసం డీడీ చెల్లించి తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకోవాల్సి ఉంటుంది. డీడీతోపాటు వాహనం కిరాయి, వీడీసీకి గ్రామాభివృద్ధి కోసం కొంత చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు దాదాపు రూ.2,300 నుంచి రూ.2,500 వరకు ఖర్చవుతుంది. కానీ అధికారులు అనుమతులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో బయటివారు అక్రమంగా తవ్వకు వచ్చిన ఇసుకను ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 5వేలకుపైగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుక కోసం దాదాపు 500 మంది దరఖాస్తు పెట్టుకోగా సగానికి పైగా అర్జీలు పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలిసింది.



ఎడ్లబండ్లతో ఇసుక తరలింపు



**అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు..**

అనుమతి లేకుండా ఇసుకను తరలించడం నేరం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ యంత్రాంగం అంతా ఎన్నికల విధుల్లో ఉండడంతో ఇసుకకు అనుమతులు ఇవ్వడంలో కొంత జాప్యం జరుగుతున్నది. అక్రమ రవాణాపై మాకు ఫిర్యాదులు అందాయి. తప్పకుండా నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం.

**-తహసీల్దార్ శ్రీలత**

**వాహనాలు సీజ్ చేస్తాం..**

ప్రభుత్వ అనుమతుతి లేకుండా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేస్తాం. ఎన్నికల విధుల్లో ఉన్నప్పటికీ వాహనాలను తనిఖీ చేస్తున్నాం. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు.

**-హరిబాబు, ఎస్సై, భీమ్‌గల్**